

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

5 సిద్దిపేట
సోమవారం 1 సెప్టెంబరు 2025

మండపాల్లో కొలువైన గణపయ్యలు



రాజేంద్రనగర్ మహా ఆంజనేయస్వామి దేవస్థానంలోని గణేష్ మండపంలో కుంకుమార్చన



ఓ వైపు పూజలు, మరోవైపు నిమజ్జనాలు

సిద్దిపేటలో వినాయక నవరాత్రులు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. వీధుల్లో వెలసిన గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేస్తున్నారు. రాత్రి సమయాల్లో రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో వినాయక మండపాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. ఆదివారం పలు మండపాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మట్టి గణపతి వద్ద అన్నదానం చేశారు. రాజేంద్రనగర్ కాలనీలోని శ్రీ మహా ఆంజనేయ స్వామి దేవస్థానంలో గణేష్ మండపంలో కుంకుమార్చన నిర్వహించారు. మరోవైపు ఇళ్లల్లో, అపార్ట్‌మెంట్లలో ప్రతిష్ఠించిన గణపతులను నిమజ్జనం చేసేందుకు భక్తులు కోమటి చెరువుకు తరలిస్తున్నారు. దీంతో కోమటి చెరువు వద్ద వినాయక నిమజ్జన సందడి మొదలైంది.

- సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి)



కోమటి చెరువులో వినాయకుల నిమజ్జనం



డ్యాన్సులు చేస్తున్న యువతీయువకులు



దుబ్బాకలో చక్రాలబండిపై వినాయకుడిని తీసుకెళ్తున్న చిన్నారులు

సిద్దిపేటకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను నియమించాలి

- మున్సిపల్‌లో ఫాగింగ్‌కు నిధుల కొరత
- స్టాంపు రిజిస్ట్రేషన్ల ఆదాయం నుంచి పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించాలి
- అసెంబ్లీలో ప్రస్తావించిన మాజీ మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట మున్సిపాలిటీకి తక్షణమే శానిటరీ ఇన్‌స్పెక్టర్లను నియమించాలని, దీనికోసం ప్రభుత్వం మున్సిపల్ శాఖలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో నూతన మున్సిపాలిటీల ఏర్పాటుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త మున్సిపాలిటీలకు బీఆర్ఎస్ వ్యతిరేకం కాదని తెలిపారు. సిద్దిపేటతో పాటు పలు మున్సిపాలిటీల్లో ఫాగింగ్ చేయడానికి కూడా నిధులు లేని దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రగతికి నిధులు విడుదల చేయడం లేదని, కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు రాక మున్సిపాలిటీలు అభివృద్ధికి నోచుకోవడం లేదని చెప్పారు. సిద్దిపేట మున్సిపాలిటీలో గతంలో ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉండేవారని, ప్రస్తుతం ఒక్కరు కూడా లేరని ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన "శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కావలెను" కథనాన్ని ప్రస్తావిస్తూ, దాని ఆధారంగా వెంటనే మున్సిపల్ శాఖలో నియామక ప్రక్రియ చేపట్టాలని కోరారు. అంతేకాకుండా, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని మున్సిపాలిటీల పరిధిలోని రిజిస్ట్రేషన్ల నుంచి పట్టణ అభివృద్ధికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో పాటు, ఎస్‌డీఎఫ్ నిధులతో పనులు జరిగేలా చూడాలని సూచించారు.



చుంచనకోట శివారులో చిరుతపులి సంచారం!

- లేగదూడను గుట్టలోకి ఈడ్చుకెళ్లి చంపిన చిరుత
- గమనించిన స్థానికుడు
- ఫారెస్ట్ అధికారులకు సమాచారం

చేర్యాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చుంచనకోట శివారులో చిరుత పులి సంచారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన యాట కనకయ్య శివారులోని వ్యవసాయ బావి వద్ద రోజువారీలాగా ఆదివారం ఉదయం పశువులను మేతకు వదిలి కొంతసేపటి తరువాత తిరిగి చేరుకున్నాడు. ఇంతలో ఆవు అరుస్తుండటంతో కనకయ్య అతడి తండ్రి ఆగయ్య వెళ్లిచూడగా లేకదూడ కనిపించలేదు. పరిసరాల్లోని రక్తపు మరకలను గమనిస్తూ సమీపంలోని పెద్దగుట్టపై వరకు వెళ్లారు. గుట్టపై లేగ దూడ చనిపోయి కనిపించింది. చుట్టుపక్కల గమనించగా చిరుతపులి కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలపడంతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వై.రాములు చుంచనకోటకు చేరుకుని రక్తపు మరకలు, గుట్ట పరిసరాలు పరిశీలించారు. ఖాళీప్రదేశంలో కనిపించిన పాద ముద్రను పరి శీలించి కొలతలు తీసుకున్నారు. నేలపై స్పష్టంగా ముద్ర కనిపించకపోవడంతో అది పులిదా? లేదా నక్కదా? అని నిర్ధారణకు రాలేదు. రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ప్రక్షాళన షురూ

- సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో బదిలీల పర్వం
- పలు విభాగాల్లో ఏళ్ల తరబడి పాతుకుపోయిన సిబ్బంది
- ఇటీవల 'ఆంధ్రజ్యోతి' కథనంలో ప్రస్తావన
- 50 మందికి పైగా స్థానచలనం
- ఆందోళనలో తాత్కాలిక ఉద్యోగులు

సిద్దిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ఏళ్ల తరబడి ఒకే సెక్షన్‌లో పాతుకుపోయిన ఉద్యోగులను బదిలీ చేస్తూ, అవినీతి ఆరోపణలకు చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టారు.





కొన్నేళ్లుగా సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలోని పలు సెక్షన్లలో పాతుకుపోయిన సిబ్బందిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ స్పందించారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఒకే సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్న రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఇతర సెక్షన్లకు బదిలీ చేశారు. అలాగే, మున్సిపల్ పరిధిలోని 43 వార్డులకు 36 మందిని వార్డు ఆఫీసర్లుగా నియమించారు. ఇప్పటి వరకు 50 మందికి పైగా ఉద్యోగులను వివిధ సెక్షన్లకు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తాత్కాలిక ఉద్యోగులపై చర్యలు

మున్సిపల్ కార్యాలయంలో వివిధ పోస్టులు ఖాళీగా ఉండటంతో పదేళ్ల క్రితం పాలకవర్గం అనుమతితో తాత్కాలిక పద్ధతిపై ఉద్యోగులను నియమించారు. వీరిలో కొందరిని శానిటరీ విభాగంతో పాటు, వారి అర్హతలను బట్టి కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా నియమించారు. కొన్ని నెలలుగా రాజకీయ నాయకుల అండతో ఇష్టానుసారంగా వ్యవహరించడం, అవినీతికి పాల్పడటం, చివరికి రెగ్యులర్ ఉద్యోగులనే శాసించే స్థాయికి ఎదగడం వంటి విషయాలు ఇటీవల 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంలో ప్రస్తావనకు రావడంతో ఉన్నతాధికారులు బదిలీల ప్రక్రియను చేపట్టారు.

అయోమయంలో ఉద్యోగులు

మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగం, హెల్త్ ఇంజనీరింగ్, శానిటేషన్, జనన, మరణ విభాగాలు, జనరల్ అడ్మినిస్ట్రేషన్, ట్రేడ్ లైసెన్స్, మెప్మా వంటి సెక్షన్లలో

మిగతా 8వ పేజీలో



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

నేడు అన్ని పాఠశాలల్లో 'రీడ్ ఏ థాన్'

- అరగంట పాటు సామూహిక పుస్తక పఠనం
- 'అన్ని వదిలేసి పుస్తకం పట్టండి' నినాదంతో కార్యక్రమం

కొండపాక, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో "రూమ్ టూ రీడ్" సంస్థ ఇండియా గెట్స్ రీడింగ్ 7.0 రీడ్ ఏ థాన్ కార్యక్రమాన్ని నేడు నిర్వహిస్తోంది. ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 11 గంటల నుంచి 11:30 నిమిషాలకు వరకు అన్ని పాఠశాలల్లో అరగంట పాటు సామూహిక పుస్తక పఠనం చేపట్టనున్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరగనుంది. "అన్ని వదిలేసి పుస్తకం పట్టండి" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీని ముఖ్య ఉద్దేశం మై బుక్ మై స్టోరీ దేశవ్యాప్త పరిధిని పెంచడం.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి ముంగ్రాతి రమేష్ సూచించారు.

తిమ్మాపూర్‌ను వణికిస్తున్న విషజ్వరాలు

- మరో బాలుడి పరిస్థితి విషమం..
- రెయిన్‌బో ఆస్పత్రికి తరలింపు
- అప్రమత్తం కాని వైద్య యంత్రాంగం
- సర్వేలకే పరిమితమైన సిబ్బంది
- కలెక్టర్ ఆదేశించినా పారిశుధ్య చర్యలు నామమాత్రమే

జగదేవ్‌పూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ గ్రామాన్ని విషజ్వరాలు ఇంకా వణికిస్తున్నాయి. ఇటీవల ముగ్గురు మరణించినా పరిస్థితిలో మార్పు రాలేదు. పది రోజుల క్రితం కలెక్టర్ హైమావతి గ్రామంలో పర్యటించి, మెరుగైన వైద్యసేవలు, పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అయినప్పటికీ, పనులు నామమాత్రంగానే సాగుతున్నాయి. ప్రస్తుతం తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో దాదాపు 30 మందికి పైగా విషజ్వరాలతో బాధపడుతూ వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో 20 మందికి పైగా చిన్నారులు ఉన్నారు.

బాలుడి పరిస్థితి విషమం

తిమ్మాపూర్‌కు చెందిన కొంతం యశ్వంత్ అనే బాలుడు పది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. మొదట స్థానిక వైద్యులకు చూపించినా జ్వరం తగ్గకపోవడంతో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఐదు రోజులు చికిత్స పొందినప్పటికీ ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో వైద్యుల సూచన మేరకు సిద్దిపేటలోని శిశురక్ష ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా ఆరోగ్యం విషమించడంతో ఆదివారం హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రికి తీసుకెళ్లారు. యశ్వంత్ పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

జ్వర సర్వేలకే పరిమితం

గ్రామంలో విషజ్వరాలు తీవ్రంగా ఉన్నప్పటికీ, వైద్య శాఖ మెరుగైన సేవలు అందించడంలో విఫలమైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినా, అవి కేవలం రక్త నమూనాలు సేకరించి మందులు ఇవ్వడానికే పరిమితమయ్యాయి. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఇంటిం టి జ్వర సర్వేలు చేస్తున్నప్పటికీ, జ్వరం ఉన్నవారిని ముందస్తుగా గుర్తించలేకపోతున్నారు. సర్వే వివరాలను ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కుటుంబమంతా జ్వరాలు

తిమ్మాపూర్ గ్రామానికి చెందిన క్యాసారం లావణ్య కుటుంబం మొత్తం జ్వరాల బారిన పడింది. మొదట ఆమె కూతురికి జ్వరం రాగా వారం రోజులు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ఆమె కోలుకుంటుండగా లావణ్యకు జ్వరం వచ్చింది. స్థానికంగా, గజ్వేల్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందినప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. ప్రస్తుతం ఆమె అత్త కూడా జ్వరంతో బాధపడుతోంది. గ్రామంలో తక్షణమే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, పారిశుధ్య చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు పోతున్నాయని వారు వాపోతున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



నర్సయ్య

తొగుట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన సంఘటన తొగుట మండలం చందాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చందా నర్సయ్య (54)కు గ్రామంలోని కూడవెల్లి వాగు శివారులో ఎకరం వ్యవసాయ భూమి ఉంది. ఆయన అందులో వరి సాగు చేశాడు. పంటకు నీరందించడానికి వాగులో మోటారు పెట్టాడు. మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మోటారు వరద ఉధృతికి కొద్దిదూరం కొట్టుకుపోయి ఆగింది. ఈ క్రమంలో ఆదివారం పంటకు నీరందించేందుకు వాగు వద్దకు వెళ్లిన నర్సయ్య ఆ మోటారును సరి చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు లక్ష్మి, సరిత, ఒక కుమారుడు కృష్ణ ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు. అయితే, విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ నర్సింహులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత రైతు కుటుంబానికి ప్రభుత్వం రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

విధుల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం

- ఆసుపత్రి ఓపీ, మెడిసిన్ రిజిస్టర్లను తీసుకెళ్లిన కలెక్టర్



మద్దూరు/కొమురవెల్లి, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలం లద్నూరులోని 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ హైమావతి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. మెడికల్ ఆఫీసర్లు మహేందర్, అర్జున్‌రాజ్‌తో పాటు ఆప్తాల్మిక్ అధికారి భాస్కర్‌రెడ్డి లేకపోవడంతో పాటు ఆసుపత్రిలో స్టాఫ్ నర్సు, అటెండర్ మాత్రమే ఉండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించగా, ఏ రోజు ఎంత మంది వైద్య సేవలు పొందారో తేదీలు వేయకపోవడం, ఫార్మసీ రిజిస్టర్, మెడికల్ ఆఫీసర్ ఓపీ రిజిస్టర్ల మధ్య తేడాలు ఉండటంతో స్టాఫ్ నర్సును నిలదీశారు. ఆసుపత్రిలోని ఓపీ, మెడికల్ ఆఫీసర్ల రిజిస్టర్లు ఎవరికీ అర్థం కాని విధంగా ఉన్నాయని మండిపడ్డారు. డీఎంహెచ్‌వోకు చూపించేందుకు రిజిస్టర్లను తన వెంట తీసుకెళ్తున్నట్లు తెలిపారు. వైద్యం కోసం వచ్చిన వారిని పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి పునరుద్ధరణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ రాజేశ్‌తో మాట్లాడి, పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మద్దూరులోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి, టీ-పోల్ సైట్‌లో ఓటరు నమోదు, అభ్యంతరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించి తగు సూచనలిచ్చారు. కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను కలెక్టర్ హైమావతి ఆదివారం సందర్శించారు.

పంచాయతీ కార్మికుల పోరు

- గ్రీన్‌ఛానెల్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్
- తప్పని అదనపు భారం..
- తక్కువ వేతనాలతో తొలగింపు భయం
- ఉద్యోగ భద్రత కోసం పోరాటం

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి, అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు ఆందోళన బాట పట్టారు. అదనపు పనిభారంతో పాటు, ఉద్యోగ భద్రత లేకపోవడంతో వేతనాల పెంపు, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సిద్దిపేట జిల్లావ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో సుమారు 1400 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారికి ప్రస్తుతం రూ.9,500 వేతనం లభిస్తోంది.

కార్మికులపై అదనపు భారం, తక్కువ వేతనం

గ్రామ పంచాయతీ కార్మికులు పారిశుధ్యం మంచినీటి సరఫరా, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం, ఇంటి పన్నులు వసూలు చేయడం, వీధి లైట్ల నిర్వహణ వంటి అనేక పనులు చేస్తున్నారు. ప్రస్తుతం వినాయక చవితి, దసరా పండుగల సందర్భంగా అదనపు పనులు చేయించుకోవడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తున్నా, అందుకు తగిన వేతనాలు ఇవ్వడం లేదని కార్మిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామపంచాయతీ కార్మికులు (ఫైల్)

గ్రీన్ ఛానెల్ ద్వారా...

ప్రతి నెలా గ్రీన్ ఛానెల్ ద్వారా జీతాలు ఇవ్వాలని కార్మికులు, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. జిల్లాలోని చాలామంది కార్మికుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో, తక్కువ వేతనాలు ఇచ్చి ఉద్యోగాల నుంచి తొలగించే అవకాశం ఉందని వారు ఆరోపిస్తున్నారు. పేర్లు నమోదు కాని కార్మికులను అధికారులు బెదిరింపులకు గురిచేస్తున్నారని, తక్షణమే అందరి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనితో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన బాట పట్టారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి. ఆన్‌లైన్‌లో కార్మికుల పేర్లను నమోదు చేసి, ప్రతి నెలా 5వ తేదీలోపు గ్రీన్ ఛానెల్ ద్వారా వేతనాలను అందించాలి. కార్మికులకు రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలి. గ్రామ పంచాయతీ సిబ్బందికి యూనిఫామ్, చెప్పులు, నూనె, గ్లౌజులు, సబ్బులు, రెయిన్‌కోట్లు వంటివి అందించాలి. ఉద్యోగ భద్రత కల్పించి కార్మికులను పర్మినెంట్ చేయాలి. కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా ఇవ్వాలి. మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలి. ఈ డిమాండ్ల సాధన కోసం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలను చేపడుతున్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారి పోరాటాలకు అండగా ఉంటాం. పంచాయతీ కార్మికులను ఉద్యోగులుగా గుర్తించి వారి డిమాండ్లను పరిష్కరించాలి. లేనిపక్షంలో భవిష్యత్తులో ఉధృతమైన పోరాటాలకు సిద్ధమవుతాం.

- గోపాలస్వామి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు ఐదు పతకాలు

7

నేనింతే.. నచ్చకుంటే బదిలీ చేయించండి

● ఉన్నతాధికారుల ముందే ట్రాన్స్‌కో లైన్‌మన్ బరితెగింపు


అల్లాదుర్గం ట్రాన్స్‌కో కార్యాలయంలో విచారణ చేస్తున్న ఉన్నతాధికారులు

అల్లాదుర్గం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్న ట్రాన్స్‌కో లైన్‌మన్ రమేష్‌పై అల్లాదుర్గం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 25న ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, విచారణకు వచ్చిన అధికారుల ముందే నా పనితీరు ఇలాగే ఉంటుంది, నచ్చకపోతే మరో ప్రాంతానికి బదిలీ చేయండి అని రమేష్ అనడం గమనార్హం. రమేష్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నాడని, ఉద్యోగం చేసే చోట కాకుండా 25 కిలోమీటర్ల దూరంలోని తన స్వగ్రామంలో ఉంటున్నాడని స్థానికులు ఆరోపించారు. ఇటీవల విద్యుత్ తీగలు తెగిపడినప్పుడు గంటన్నర ఆలస్యంగా వచ్చారని, దీంతో ఉన్నతాధికారులు రమేష్‌కు సంబంధించిన ఒక రోజు వేతనాన్ని నిలిపివేశారని తెలిపారు. దీనిపై గ్రామస్థులు మరోసారి ఫిర్యాదు చేయగా, శనివారం అధికారులు విచారణ చేపట్టారు. రమేష్ నిర్లక్ష్య వైఖరిపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


శివ్వంపేటలో రాస్తారోకో చేస్తున్న రైతులు

తప్పని యూరియా కష్టాలు


చిన్నశంకరంపేట : జంగరాయి సహకార సంఘం వద్ద మహిళా రైతుల పడిగాపులు

చిన్నశంకరంపేట/ వెల్దుర్తి/ శివ్వంపేట/జోగిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. ఆదివారం కూడా పలుచోట్ల అన్నదాతలు పడిగాపులు పడ్డారు. చిన్నశంకరంపేట, వెల్దుర్తి, జోగిపేట మండలాల్లో రైతులు బారులు తీరారు. పోలీసుల బందోబస్తు మధ్య యూరియాను విక్రయించారు. కొందరు యూరియా లభించని రైతులు నిరాశతో వెనుదిరిగారు. శివ్వంపేటలో యూరియా రావడం ఆలస్యం కావడంతో తూప్రాన్-నర్సాపూర్ జాతీయ రహదారిపై శివ్వంపేటలో రైతులు సుమారు గంటపాటు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.


వెల్దుర్తి రైతు వేదిక వద్ద చెప్పుల క్యూ

భక్తి పారవశ్యం


కొండపోచమ్మ ఆలయంలో భక్తుల క్యూ


కొమురవెల్లి/జగదేవ్‌పూర్/ పాపన్నపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం సెలవు కావడంతో కొమురవెల్లి మల్లికార్జున స్వామి, ఏడుపాయల వన దుర్గామాత, జగదేవ్‌పూర్ మండలం తీగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలో ఉన్న కొండపోచమ్మను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకున్నారు.


కొండపోచమ్మ అమ్మవారు


చేర్యాలలో వినాయకుడికి నివేదించిన 151 రకాల నైవేద్యాలు

మహా గణపతిం.. మనసాస్మరామి

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 31: వినాయక మండపాల్లో భక్తులు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. అయోధ్యరాముడు, బాలగణపతి, అయ్యప్ప, లంబోదరుడు, శ్రీరాముడు, శివాజీ తదితర రూపాల్లో గణపతులను కొలవుదీరారు. ఆదివారం ఐదో రోజు కావడంతో హోమాలు, కుంకుమ పూజలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జోరుగా సాగాయి. రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామంలో గణపయ్యను ఎడ్లబండిపై ఊరేగింపుగా తీసుకువెళ్లి గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. దుబ్బాకలో రాత్రి చక్రాలబండిపై చిన్నారులు వినాయక శోభాయాత్ర నిర్వహించారు. చేర్యాలలో 151 రకాలు, దుబ్బాకలోని కేదారేశ్వరాలయంలో 56 రకాల నైవేద్యాలను సమర్పించారు. కొండపాక మండల కేంద్రంలో జాగృతి ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ఐఏఎస్ అఖిల్ ప్రత్యేక పూజలు చేశారు.


దుబ్బాకలో 56 నైవేద్యాలు..


మెదక్‌లో త్రిముఖ గజానవాపై..


ఫతేనగర్‌లో అయ్యప్పస్వామి ఆకృతిలో గణనాథుడు


కల్హేర్‌లోని డీఎస్ కాలనీలో అయోధ్య బాలరాముడి రూపంలో..

గ్రామస్థులంతా ఏకమై చెరువును కాపాడుకున్నారు


ఖాజీపూర్‌లో చెరువుకు పడిన గండిని పూడ్చుతున్న గ్రామస్థులు

మిరుదొడ్డి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఐమత్యంతో ఏదైనా సాధ్యమేనని నిరూపించారు సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని ఖాజీపూర్ గ్రామస్థులు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ఖాజీపూర్ గ్రామంలోని పెద్ద చెరువుకు పెద్ద గండిపడింది. ఈ సమాచారమందుకున్న గ్రామస్థులు వెంటనే స్పందించారు. ఆదివారం ఊరంతా ఏకమై గ్రామంలోని చెరువుకు పడిన గండిని పూడ్చే ప్రయత్నం చేశారు. గత 3 రోజులు కురిసిన వర్షానికి గ్రామంలో పెద్దచెరువు నిండుకుండలా మారింది. చెరువు నిండి అలుగుపారుతున్న దృశ్యం చూడకముందే చెరువుకు గండి పడింది. దీంతో ఎలాగైనా సాగునీటిని కాపాడుకోవాలనే ఉద్దేశంతో ట్రాక్టర్లతో మట్టిని తీసుకుని వచ్చి, ఎక్స్‌కవేటర్‌ను ఉపయోగించి చెరువుకు పడిన గండిని పూడ్చారు. ఒకవేళ చెరువుకు పడిన గండిని పూడ్చకుంటే కట్ట పూర్తిగా తెగిపోయే పరిస్థితి తలెత్తేది. చెరువుకు పడిన గండిని తాత్కాలికంగా పూడ్చినప్పటికీ, తమ కష్టానికి ఫలితం ఉంటుందో లేదో అని స్థానిక రైతులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెద్దచెరువుకు మరమ్మతు పనులను చేపట్టాలని కోరుతున్నారు.

నిద్రలోనే కార్మికుడి మృతి

పటాన్‌చెరు ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : నిద్రలోనే ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిబెంగ రాష్ట్రం బాగిటూం గ్రామానికి చెందిన సునీల్‌యాదవ్ (43) పెద్ద కంజర్ల గ్రామంలోని అరబిందో నిర్మాణసంస్థలో కార్మికుడిగా పని చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం నిద్రపోయిన అతడు ఎంతకీ లేవలేదు. తోటివారు పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించారు. తోటి కార్మికుడు రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బస్సులో మరిచిన బ్యాగు అప్పగింత


ప్రయాణికురాలికి బ్యాగును అప్పగిస్తున్న దృశ్యం

కోహీర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన నిర్మల అనే మహిళ తన బ్యాగును బస్సులోనే మరిచిపోయింది. ఆ బ్యాగును గుర్తించిన పోలీసులు, ఆర్టీసీ అధికారులు ఆమెకు తిరిగి అప్పగించారు. బ్యాగులో 12.5 గ్రాముల బంగారం, రూ.50 వేల నగదు ఉన్నాయి. కోహీర్ ఎస్.ఐ. నరేష్, జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సమాచారం అందించి బస్సు డ్రైవర్, కండక్టర్‌తో మాట్లాడారు. వారు వెంటనే బ్యాగును గుర్తించి పోలీస్ స్టేషన్‌లో అప్పగించగా, నిర్మలకు తిరిగి ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు, ఆర్టీసీ అధికారుల చొరవను బాధితురాలు అభినందించారు.

జూద స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

కొండపాక, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో చిత్తు బొత్తు (జూదం) ఆడుతున్న స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. గ్రామ శివారులోని పండ్ల తోటలో ఏడుగురు వ్యక్తులు జూదం ఆడుతుండగా దాడి చేసి పట్టుకున్నామని కుకునూరుపల్లి ఎస్.ఐ. శ్రీనివాస్ తెలిపారు. ఇద్దరు వ్యక్తులు (సురేందర్ గౌడ్, సంతోష్) పట్టుబడగా, మిగతా ఐదుగురు పరారయ్యారని, వారి వద్ద నుంచి రూ.700, రూ.50 వేల విలువైన ఆన్‌లైన్ లావాదేవీల రికార్డులు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్.ఐ. తెలిపారు.

కిలోన్నర గంజాయి పట్టివేత

రామచంద్రాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర నుంచి తరలిస్తున్న కిలోన్నర గంజాయిని సంగారెడ్డి జిల్లా కొల్లూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ రవీందర్ కథనం ప్రకారం... కూకట్‌పల్లిలో నివాసముంటున్న అజయ్(23) ఓసారి పాన్‌షాపు నిర్వహణ, మరోమారు ఆటోడ్రైవర్‌గా పనిచేశాడు. పెద్దఎత్తున డబ్బులు రావడం లేదని ఆలోచించిన అజయ్ గంజాయి విక్రయించడానికి సిద్ధపడ్డాడు. రెండు, మూడుసార్లు మహారాష్ట్ర నుంచి గంజాయి కొని తెచ్చి తెల్లాపూర్‌లోని లేబర్ షెడ్డుల్లోని లేబర్లకు విక్రయించాడు. రెండురోజుల క్రితం మహారాష్ట్ర నుంచి కిలోన్నర గంజాయి తీసుకొచ్చిన అజయ్.. ఆదివారం కూకట్‌పల్లి నుంచి బస్సులో తెల్లాపూర్‌కు వచ్చి గద్దర్ విగ్రహం వద్ద లేబర్ షెడ్లకు వెళ్లేందుకు నిల్చున్నాడు. ముందస్తు సమాచారంతో గద్దర్ సర్కిల్ వద్ద ఎస్ఐ రవీందర్ తన సిబ్బంది నిఘావేసి పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ నిందితుడిని రిమాండ్‌కు తరలించారని సీఐ తెలిపారు.



సంచార జాతుల విముక్తి దినోత్సవంలో పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్

కనుమరుగవుతున్న సంచార జాతుల కళలు

» ప్రధాని మోదీ ఆదేశాలతో విముక్తి దినోత్సవం: కె.లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల విన్యాసాలు, హరి కథలు, బుర్ర కథలు వంటి సంప్రదాయ కళలు అంతరించిపోవడం దురదృష్టకరమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్య కేంద్రంలో నిర్వహించిన సంచార జాతుల విముక్తి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడారు. ప్రధాన మోదీ సంచార జాతుల విముక్తి దినోత్సవ ప్రాముఖ్యతను గుర్తించి, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అధికారికంగా ఈ వేడుకను జరపాలని ఆదేశించారని తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. తాను 1999లో మొదటిసారి శాసన సభ్యుడిగా ఎన్నికైనప్పుడు అసెంబ్లీలో సంచార జాతుల సమస్యలను ప్రస్తావించానని గుర్తు చేశారు. ఆ తర్వాతే అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సంఘాలతో మాట్లాడి కులాల పేర్లను అధికారికంగా మార్చారని పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ చేసిన కుల గణన ఓటు బ్యాంకు దృష్టితో జరిగిందని, అందులో బీసీలకు, అణగారిన వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. కులాల వారీ లెక్కలు అధికారికంగా రావాలంటే కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగే గణన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సంచార జాతుల్లో కులాల లెక్కలు అధికారికంగా తేలితే బడ్జెట్ కేటాయింపులు, అభివృద్ధి ప్రణాళికలను స్పష్టంగా అమలు చేయవచ్చని లక్ష్మణ్ అన్నారు.

వివరణ ఇచ్చేందుకు 10 రోజుల గడువు ఇవ్వండి

» స్పీకర్‌ను కలిసి కోరిన కడియం, అరికెపూడి, దానం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు మేరకు జారీ చేసిన నోటీసులపై విచారణకు హాజరై వివరణ ఇచ్చేందుకు తమకు పది రోజుల గడువు ఇవ్వాలంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్ కోరారు. అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో ఆదివారం ఆయన్ను కలిసిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మిగిలిన ఎమ్మెల్యేలూ స్పీకర్‌ను కలిసి గడువు కోరనున్నట్లు తెలుస్తోంది. అనంతరం అసెంబ్లీ లాబీల్లో కడియం, అరికెపూడి గాంధీ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. తాము వివరణ ఇచ్చేందుకు స్పీకర్‌ను పది రోజులు గడువు ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. కాగా.. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి మారిన పది మంది ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలంటూ గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు ఇచ్చిన బీఆర్ఎస్.. ఈ అంశంపైన సుప్రీం కోర్టునూ ఆశ్రయించగా.. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇందులో భాగంగానే పది మంది ఎమ్మెల్యేలకూ స్పీకర్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది.

ఆర్ఎఫ్‌సీఎల్ లో లీకేజీలకు ఎవరిది బాధ్యత..?

» రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్)లో అమ్మోనియా పైప్‌లైన్ వరుస లీకేజీలకు బాధ్యత ఎవరిదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రశ్నించారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం నిర్మిస్తే రాష్ట్ర రైతాంగానికి యూరియా సకాలంలో అందుతుందని యూపీఏ ప్రభుత్వం ప్లాంట్ నిర్మాణానికి అనుమతినిచ్చిందని తెలిపారు. ప్లాంటు అవసరాలకు మిషన్ భగీరథ నీరు ఇస్తున్నామని, ఉత్పత్తిలో 50శాతం యూరియాను తెలంగాణకు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచే ఈ సీజన్లో రాష్ట్రానికి రావాల్సిన 1.2లక్షల టన్నుల యూరియాను తగ్గించారన్నారు. ప్లాంట్‌లో నిర్మాణలోపాలు, అధికారుల నిర్లక్ష్యంపై సీబీఐతో విచారణ జరిపించాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు.

కేటీఆర్.. ఓ మానసిక రోగి

ఉపరాష్ట్రపతి ఎన్నికకు యూరియాకు ఏం సంబంధం?.. ఎన్డీఏ అభ్యర్థికే ఓటేస్తామని చెప్పొచ్చుగా?

- » నాపై 181 కేసులు బనాయించారు
- » ఇల్లు కూల్చేశారు..నన్ను కిడ్నాప్ చేశారు
- » చంద్రబాబుతో సంప్రదింపులు అబద్ధం
- » 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని
- » 'ఇండియా టుడే' ఇంటర్వ్యూలో రేవంత్



న్యూఢిల్లీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక మానసిక రోగి అని, యూరియా ఇస్తేనే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామనడం పిచ్చికి పరాకాష్ట అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అనవసరంగా ఇలాంటి నాటకాలు ఎందుకని, ఎన్డీఏ అభ్యర్థికి మద్దతిస్తామని కేటీఆర్ చెప్పవచ్చు కదాని పేర్కొన్నారు. యూరియా ఇచ్చేది కేంద్రమని, అలాంటప్పుడు యూరియా ఇస్తేనే ఇండి కూటమి అభ్యర్థికి మద్దతు ఇస్తామని ఎలా అంటున్నారని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో తనపై అక్రమంగా 181 కేసులు బనాయించారని, ఆ కేసులే తనకు మెడల్స్ అని చెప్పారు. తెలుగు రాష్ట్రాల తోపాటు తమిళనాడు, కర్ణాటక, గుజరాత్.. ఇలా అనేక రాష్ట్రాల్లో తెలుగు మాట్లాడే ఎంపీలు ఉన్నారని, వారంతా కలసి సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇటీవల సీఎం రేవంత్‌ను ఇండియా టుడే ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది. అందులో రేవంత్ ఆసక్తికర అంశాలను వెల్లడించారు.

బీఆర్ఎస్ పతనావస్థకు చేరింది..

గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవ దానం చేసి బీజేపీని 8 సీట్లలో గెలిపించిందని రేవంత్ చెప్పారు. బీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి ఒక్క పార్లమెంట్ సీటైనా గెలిచిందని, ఇప్పుడు ఘోరంగా పతనావస్థకు చేరిందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్‌లోనూ బీజేపీనే గెలిచిందన్నారు.

కేసులతో ఖతం చేయాలని చూశారు..

ప్రజల కోసం ప్రశ్నించిన ప్రతిసారి తనపై కేసులు పెట్టారని, అలా కేసులు పెట్టిన ప్రతిసారీ తనకు ప్రజల్లో మద్దతు పెరిగిందని రేవంత్ చెప్పారు. "నాపై 181 అక్రమ కేసులు పెట్టారు. ఎప్పటికైనా తన ప్రత్యర్థిని నేనేనని కేసీఆర్‌కు తెలుసు. అందుకే నన్ను హింసించేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. నాపై క్రిమినల్ కేసులు పెట్టి ఖతం చేయాలని చూశారు. ఎన్నికల సమయంలో నా ఇల్లు కూల్చేశారు. నన్ను కిడ్నాప్ చేశారు. మూడు నెలలకే ఎంపీగా గెలిచి ఢిల్లీకి వచ్చా. ఈ రోజు సీఎం అయ్యా" అని తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆ బిల్లు..

ఏదైనా కేసులో అరెస్టయి 30 రోజులకుపైగా జైలులో ఉన్న సీఎంలు, మంత్రులను పదవి నుంచి తప్పించే బిల్లును రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకే దానిని తీసుకువచ్చారని ఆరోపించారు. "ప్రస్తుతం విపక్ష సీఎంలను టార్గెట్ చేసి కేసులు పెట్టడం చూస్తున్నాం. చిన్న అంశాల్లోనూ 30 రోజులు జైల్లో పెట్టొచ్చు. ఇదేమీ అంత పెద్ద విషయం కాదు. కొత్త బిల్లు చట్టంగా మారాక ఢిల్లీ ఆదేశాలను అమలు చేయకపోతే.. రాష్ట్రాల సీఎంలు ఎవరైనా పదవి వదులుకోవాల్సి వస్తుంది. ఈ అంశంపై యోగి ఆదిత్యనాథ్ సహా బీజేపీ సీఎంలే ఆందోళన చెందుతుంటే.. మిగతా సీఎంల పరిస్థితి ఏమిటి?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అలాగని తానేమీ భయపడటం లేదని, తానెలాంటి తప్పూ చేయలేదని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి మద్దతివ్వకపోతే ఖతం చేయడమే వాళ్లకు తెలుసని ఆరోపించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై అమిత్‌షా వ్యాఖ్యలు అత్యంత దారుణమని మండిపడ్డారు.

చంద్రబాబుతో సంప్రదింపులు అవాస్తవం

2024లో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటు సమయంలో చంద్రబాబుతో తాను సంప్రదింపులు జరిపాననేది అవాస్తవ ప్రచారమని రేవంత్ స్పష్టం చేశారు. తానెప్పుడూ అటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. అలాంటి రాజకీయాలను రాహుల్ గాంధీ విశ్వసించరని.. ఆయన అలా అనుకుంటే ఎప్పుడో ప్రధాని అయ్యేవారని చెప్పారు. చంద్రబాబు సీనియర్ రాజకీయవేత్త అని, రాజకీయ ఎత్తుగడల్లో ఆయనకు మించిన వారెవరూ లేరని పేర్కొన్నారు. చంద్రబాబును తాను గౌరవిస్తానని, కానీ తనకు పార్టీ, తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. తన రాజకీయ అంచనాలు ఎప్పుడూ తప్పలేదని.. 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని అని, కావాలంటే రాసిపెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రధాని మోదీకి 2029 ఎక్స్‌పైరీ తేదీ అన్నారు. తాను బీజేపీలో పనిచేయలేదని, ఏబీవీపీలో పనిచేశానని.. బీజేపీ రాజకీయ పార్టీ అని, ఏబీవీపీ విద్యార్థి సంఘమని వివరించారు. తాను ఇప్పుడు కాంగ్రెస్ యూనివర్సిటీలో ఉన్నానని చెప్పారు.

ముందు ప్రేమించా.. సినిమా స్టైల్లో పెళ్లి జరిగింది..

తన ప్రేమ, వివాహంపై రేవంత్ ఆసక్తికర విషయాలు తెలిపారు. "నాది పెద్దలు చేసిన ప్రేమ వివాహం. ముందు నేను ప్రేమించాను. తర్వాత అది అరేంజ్ మ్యారేజ్‌గా మారింది. నా భార్య గీత ఢిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీలో చదువుకుంది. నేను తెలంగాణలో ప్రభుత్వ బడిలో చదువుకున్నాను. మా పరిచయం ఊహించని విధంగా జరిగింది. విజయవాడలో వాజ్‌పేయి సభ జరిగింది. కొందరితో కలసి నేను హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాను. తిరిగి వచ్చే క్రమంలో గీత కుటుంబంతో కలిసి నాగార్జున సాగర్‌లో ఆగాం. అక్కడ గీతతో పరిచయం జరిగింది. అది ప్రేమగా మారింది. చివరికి సినిమా స్టైల్‌లో మా పెళ్లి జరిగింది. టైం దొరికితే మనవడితో ఎంజాయ్ చేస్తా" అని చెప్పారు.

ఒక్కసారి కూడా సిగరెట్ తాగలే..

జీవితంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా తాను సిగరెట్ తాగలేదని, అది తన విల్ పవర్ అని రేవంత్ చెప్పారు. తాను టీ కూడా తాగేవాడిని కాదని.. విద్యార్థి ఉద్యమాల్లోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో అలవాటైందని తెలిపారు. తాను ఫుట్‌బాల్ ఆటగాడినని, రాహుల్ గాంధీ దగ్గర సమయం దొరికినప్పుడల్లా.. ఫిట్‌నెస్‌పై సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు.

ఓటుహక్కును కొల్లగొడుతున్న మోదీ

18 ఏళ్లకు ఓటుహక్కు కల్పించిన రాజీవ్‌గాంధీ.. దానిని కాపాడుకునేందుకు కలిసికట్టుగా పోరాడదాం

- » 2029 రాహుల్ ప్రధాని అయ్యే సంవత్సరంగా చాటుదాం
- » 21 ఏళ్లకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలి : రేవంత్‌రెడ్డి
- » కేరళలో పొంథువల్ మెరిట్ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరు



విద్యార్థినికి పొంథువల్ మెరిట్ అవార్డు అందజేస్తున్న కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశంలో 18ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికీ ఓటుహక్కు కల్పించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ మాత్రం పౌరుల నుంచి ఓటుహక్కును కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ప్రతి భారతీయుడి ఓటుహక్కును కాపాడి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు అందరం కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. 18ఏళ్లకు ఓటు హక్కు కల్పించిన వారికి, ఓటు హక్కును కొల్లగొట్టిన వారికి మధ్యే 2029 ఎన్నికలు జరగబోతున్నాయని తెలిపారు. 2029ని రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే సంవత్సరంగా చాటుదామన్నారు. ఆదివారం కేరళలోని అలప్పుళలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన పొంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డుల కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీ వేణుగోపాల్ ప్రారంభించిన ఈ అవార్డులు పది, పన్నెండు తరగతుల్లోని విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేస్తున్నామని, పేదలకు నాణ్యమైన విద్యనందించాలని సంకల్పించామని తెలిపారు. 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. రాష్ట్రంలో యంగ్‌ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వయసును 21ఏళ్లకు తగ్గిస్తూ రాజ్యాంగాన్ని సవరించుకోవాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ కేవలం యువత శక్తిని నమ్ముకుని పోరాటం సాగిస్తోందన్నారు.

ఆగస్టులో రికార్డు వానలు

» సాధారణం కంటే 75% అధిక వర్ష పాతం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగస్టులో సాధారణం కంటే 75శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 21.5సెం.మీ పడాల్సి ఉండగా.. 37.85 సెం.మీ కురిసింది. అంటే రోజుకు సగటున 1.2 సెం.మీ. వాన పడింది. గత ఏడాదితో సగటు పోల్చితే ఈసారి 80శాతం అధిక వర్షపాతం నమోదైంది. కాగా, ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు సాధారణ వర్షపాతం 57.3సెం.మీ నమోదు కావాలి. అయితే ఇప్పటి వరకు 72 సెం.మీ వర్షం కురిసింది. అంటే 26శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 621 మండలాలుండగా.. 136 చోట్ల అత్యధిక (60% ఎక్కువగా), 238 చోట్ల అధిక (20-59శాతం మధ్య), 221 మండలాల్లో సాధారణ వర్షపాతం, మరో 26 మండలాల్లో 20-60శాతం లోటు వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 104 సెం.మీ పడింది. కాగా, రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

మూసివేత దిశగా..!

- ఆదరణ లేక నిరుపయోగంగా రాష్ట్రస్థాయి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల
- కంప్యూటర్లు ఇతర సామాగ్రిని హైదరాబాద్‌కు తరలింపు
- స్కిల్ యూనివర్సిటీ కళాశాలగా మార్చితే ఉపయోగం



కోహీర్ మండలంలోని కవెల్లి చౌరస్తా వంద గల రాష్ట్రస్థాయి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల భవనం

కోహీర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) గ్రామీణ పేద విద్యార్థులకు వృత్తి విద్య కోర్సు అందించి వారికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 2012 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి గీతారెడ్డి కృషితో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.12.30 కోట్లు వెచ్చించి కోహీర్ మండలంలోని కవేలి చౌరస్తా వద్ద రాష్ట్రస్థాయి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కళాశాల నిర్మాణం పూర్తయినంతవరకు వృత్తి విద్య కోర్స్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరించి తాత్కాలిక భవనంలో తరగతులు నిర్వహించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కళాశాల నిర్మాణంలో ఆలస్యమైనప్పటికీ 2017 సంవత్సరంలో కళాశాల నిర్మాణం పూర్తయింది. అదే సంవత్సరం ఆగస్టు 3న హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను అప్పటి ఆర్థిక శాఖ మంత్రి, ప్రస్తుత సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రారంభించారు. అనంతరం జాతీయస్థాయిలో పోటీ పరీక్షలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేసి పలు రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులకు ఈ కళాశాలలో డిగ్రీ తరగతులను నిర్వహించారు. మూడు సంవత్సరాల పాటు కళాశాల మంచిగా కొనసాగినప్పటికీ, కరోనా కారణంగా విద్యార్థులు కళాశాలను విడిచి వెళ్లడంతో నాటి నుంచి నేటి వరకు ప్రవేశాలు తీసుకోవడం లేదు. విద్యార్థులు చేరడం లేదు దీంతో కళాశాల నిరుపయోగంగా మారింది.

ఎంజేపీ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు

రాష్ట్ర హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులు లేక వృథాగా ఉండడం వల్ల 2023 సంవత్సరంలో ఇక్కడ మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలగా ఏర్పాటు చేసి నిరుపేద మహిళ విద్యార్థినులకు వృత్తి విద్య కోర్సు అందించాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ దిశగా జూలై, ఆగస్టు నెలలో హోటల్ మేనేజ్‌మెంట్ ఇంటర్మీడియట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థినుల నుంచి జిల్లా స్థాయిలో దరఖాస్తులు స్వీకరించారు. మొదట్లో 20 మంది విద్యార్థినులు దరఖాస్తుల చేసుకున్నారు. వెంటనే తరగతులు ప్రారంభించేందుకు అక్టోబర్ 7న మాజీ మంత్రి హరీష్‌రావు కావేలి చౌరస్తాలోని మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ హోటల్ మేనేజ్‌మెంట్ ప్రారంభించారు. అనంతరం అక్కడ సరైన ఏర్పాట్లు తగిన ఫర్నిచర్ లేకపోవడం, వివిధ కారణాల వల్ల తరగతులను నిర్వహించలేకపోయారు.

ఐదేళ్లుగా నిరుపయోగంగా..

రాజుల పైసా రాళ్లపాలు అన్నట్లు కోహీర్ మండలంలోని రాష్ట్రస్థాయి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల పరిస్థితి నెలకొంది. వృత్తివిద్య కోర్సులు అందించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రూ.12.30 కోట్లతో నిర్మించిన హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల వినియోగంలో లేకపోవడం వల్ల ప్రస్తుతం మూసివేత దిశగా ప్రక్రియ జరుగుతున్నది. ఈ కళాశాల వినియోగం లేక ఐదు సంవత్సరాలు గడుస్తుండడం వల్ల కళాశాల ఆవరణ మొత్తం పిచ్చి గడ్డితో దర్శనమిస్తుంది అంతేకాకుండా కళాశాలలోని ఫర్నిచర్ కంప్యూటర్లు పాడవుతుండడం వల్ల శనివారం రాష్ట్ర ఓటర్ మేనేజ్‌మెంట్ కళాశాల డైరెక్టర్ వెంకటరమణ, కోహీర్ తహసీల్దార్ వరప్రసాద్, ఎస్ఐ నరేష్‌లు కళాశాలను సందర్శించి కళాశాలలో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లను హైదరాబాద్‌లోని హెడ్ ఆఫీస్‌కు తరలించారు.

స్కిల్ యూనివర్సిటీ కళాశాలగా మార్చితే మేలు

కోహీర్ మండలంలోని కవెల్లి చౌరస్తా వద్ద గల హోటల్ మేనేజ్ మెంట్ కళాశాల భవనంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ కళాశాల ఏర్పాటు చేస్తే రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపయోగకరంగా ఉంటుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదట్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించింది. అందులో భాగంగానే ఇక్కడ ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను యూనివర్సిటీ కళాశాలగా మారుస్తే యువతకు మేలు జరుగుతుంది. జహీరాబాద్ ప్రాంతంలో జాతీయ పెట్టుబడులు పాదాక మండలి (నిమ్జ్) రానున్న దృశ్య ఈ కళాశాలలో వృత్తివిద్య కోర్సులు, టెక్నికల్ కోర్సులను స్కిల్ యూనివర్సిటీ ద్వారా నేర్పిస్తే యువతకు లాభం చేకూరుతుంది.

సాగుచేయని ఆకుకూరలతో ఆరోగ్యం

- పోషకాహార నిపుణుడు డా. సలోమి యేసుదాస్



సాగుచేయని ఆకుకూరలతో వండిన వంటలను వడ్డిస్తున్న డీడీఎస్ మహిళా రైతులు

జహీరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే సాగు చేయని ఆకుకూరలు తినడం వల్ల వివిధ రకాల వ్యాధులు తగ్గి ఆరోగ్యం లభిస్తుందని పోషకాహార నిపుణుడు డా. సలోమి యేసుదాస్ అన్నారు. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం అల్గోల్-దిడిగి గ్రామ శివారులోని డీడీఎస్-కేవీకేలో సాగు చేయని ఆకుకూరల పండుగ నిర్వహించారు. సందర్శకులు జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్, ఝరాసంగం మండలంలోని పొట్టిపల్లి గ్రామాల్లో డీడీఎస్ జీవవైవిధ్య రైతుల పంటపొలాలను సందర్శించి ఆకుకూరల ప్రయోజనాలను తెలుసుకున్నారు. అనంతరం డీడీఎస్-కేవీకేలో జరిగిన సమావేశంలో డా. సలోమి మాట్లాడుతూ, గ్రామీణ రైతులకు అపారమైన అనుభవం ఉంటుందని, ముఖ్యంగా డీడీఎస్ మహిళా రైతులకు చిరుధాన్యాల సాగు, సాగు చేయని ఆకుకూరలపై పూర్తిస్థాయిలో అనుభవం ఉందని చెప్పారు. సాగు చేయని ఆకుకూరలు సహజంగా లభిస్తాయని, వాటిని వండుకుని తింటే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. డీడీఎస్ ఈ అంశంపై ప్రయోగాత్మకంగా కార్యక్రమాలు చేపడుతోందని గుర్తుచేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ మీలా మాట్లాడుతూ ఆకుకూరలపై మరింత పరిశోధన జరగాలని అభిప్రాయపడ్డారు. డీడీఎస్ మహిళా రైతులు చంద్రమ్మ తదితరులు మాట్లాడుతూ, సాగు చేయని ఆకుకూరలను ప్రతిరోజు ఆహారంలో తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అనంతరం 40 రకాల సాగు చేయని ఆకుకూరల వంటకాలను అందరూ ఆరగించి ఆనందం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ మండలస్థాయి పోటీలకు ఎంపికలు

మద్దూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 2 నుంచి 4 వరకు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఎస్‌జీఎఫ్ మండలస్థాయి టోర్నమెంట్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వరదరాజు తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఉంటాయన్నారు. సెప్టెంబరు 2న ఉదయం 10 గంటలలోపు బోనఫైడ్‌తో హాజరు కావాలని సూచించారు. వివరాలకు ఫోన్ నెం. 9989132656ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో సిద్దిపేట జిల్లాకు ఐదు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో సిద్దిపేట జిల్లాకు మొత్తం ఐదు పతకాలు లభించాయని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కర్రోళ్ల వెంకటస్వామి గౌడ్ తెలిపారు. రేస్ వాక్ విభాగంలో గణేష్, జావెలిన్ త్రో విభాగంలో పవర్ నగేష్ బంగారు పతకాలు, హైజంప్‌లో ఉదయ్ కిరణ్, జావెలిన్ త్రోలో సిరిచందన వెండి పతకాలు, జావెలిన్ త్రోలో దాన్య కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. ఆ క్రీడాకారులను, జిల్లా జట్టు కోచ్ మేనేజర్లు లీలా ఆనంద్, లక్ష్మణ్‌ను డీవైఎస్వో వెంకట నర్సయ్య, సిద్దిపేట స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి పన్యాల రామేశ్వర్ రెడ్డి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసులు, టీజీ పెటా జిల్లా అధ్యక్షుడు ఏర్వ అశోక్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కామిరెడ్డి రవీందర్ రెడ్డి, శిక్షకులు నిశాంక్ గౌడ్, ప్రభాకర్, ప్రేమలత అభినందించారు.

కారు, లారీ ఢీ.. మామాఅల్లుడు దుర్మరణం

- ఐదుగురికి గాయాలు

జహీరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కారు, లారీ ఢీ.. మామాఅల్లుడు దుర్మరణం చెందారు. పట్టణ సీఐ శివలింగం, ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జహీరాబాద్ పట్టణంలోని ఆనందనగర్ కాలనీకి చెందిన మామ, అల్లుడైన సాయి (20), వెంకట్ (33) కుటుంబ సమేతంగాసంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమానికి దైవదర్శనం కోసం ఆదివారం సాయంత్రం కారులో వెళ్తున్నారు. జహీరాబాద్-బీదర్ రోడ్డుపై ఎదురుగా వస్తున్న లారీ వీరి కారును ఢీకొట్టడంతో సాయి, వెంకట్‌కు తీవ్ర గాయాలు కాగా జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ఘటనలో ఐదుగురు గాయపడ్డారని, వారి పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుడు వెంకటేశం బావ నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





కారులో ఇరుక్కున్నవారిని బయటకు తీస్తున్న పోలీసులు



వెంకట్ (ఫైల్)

న్యూస్ బాక్స్

రేపటిలోగా అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

దుబ్బాక, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భవాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మ్యాథమెటిక్స్(గణితం) ఒక పోస్టు ఖాళీగా ఉందని, ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం సాయంత్రం 4గంటల వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 మార్కులతో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50తో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అదేవిధంగా నీట్, సెట్, పీహెచ్‌డీ విద్యార్హతలు ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మల్లేశం యాదవ్



చిన్నకోడూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా చిన్నకోడూరు మండలం గోనెపల్లి గ్రామానికి చెందిన బత్తుల మల్లేశం యాదవ్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గొర్ల అయిలేశ్ యాదవ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మల్లేశం యాదవ్ మాట్లాడారు. బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన పై నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి గొర్ల అయిలేశ్ యాదవ్, సంఘం నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మృతురాలి కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకుల పరామర్శ

చేర్యాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం కడవేరుగు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పేర్ని రాజు మాతృవియోగం చెందాడు. ఈ మేరకు అతడి తల్లి పేర్ని లచ్చవ్వ(85) ఆదివారం మరణించడంతో మద్దూరు మాజీ ఎంపీపీ బద్దిపడిగ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేక సంతోశ్, నాయకులు సంతాపం వ్యక్తం చేసి, కుటుంబాన్ని పరామర్శించారు.

పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

● ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు

మర్కుక్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి శైలేష్‌పై సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని మర్కుక్ ఎంపీటీసీల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు రాజబోయిన కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో 18 నెలలుగా గ్రామపంచాయతీలకు తమ సొంత డబ్బును పారిశుధ్యం, వీధి దీపాలకు ఖర్చు చేస్తూ ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ పనిచేస్తున్న కార్యదర్శిని సస్పెండ్ చేయటం తగదన్నారు. గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులను కాపాడుకోవాల్సిన బాధ్యత కలెక్టర్ మీద ఉందన్నారు. డెంగ్యూ మరణాలకు ప్రధాన కారణమైన వైద్యాధికారులపై ఉన్నతాధికారులపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమని ఆయన మండిపడ్డారు.

బీసీల రిజర్వేషన్ల కోసం అన్ని సంఘాలతో కలిసి పోరాటం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్ రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేసే వరకు అన్ని సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని వివిధ కుల సంఘ నాయకులు అన్నారు. ఆదివారం గజ్వేల్ అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ దళిత సంఘాల ఐకాస రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరి ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పాఠశాలకు ప్రహరీ లేక పరేషాన్

● కొమురవెల్లిలో జనావాసాలకు దూరంగా కేజీబీవీ
● రాత్రివేళల్లో రక్షణపై విద్యార్థినుల తల్లిదండ్రుల ఆందోళన
● విశాల మైదానం ఉన్నప్పటికీ ఆటలకూ ఇబ్బందే



కొమురవెల్లిలోని రాజీవ్ రహదారి సమీపంలో ప్రహరీలేని కస్తూర్బాగాంధీ విద్యాలయం

కొమురవెల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలంలోని రాజీవ్ రహదారికి సమీపంలో గత ప్రభుత్వం హయాంలో 2021లో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి నూతన భవనాన్ని మంజూరు చేసింది. ఈ భవనానికి రూ.3.50కోట్ల నిధులు వెచ్చించి 2023లో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా నూతన భవనానికి ప్రహరీ నిర్మాణం చేపట్టకపోవడంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

రక్షణ లేక ఇక్కట్లు

కొమురవెల్లి మండలంలోని రాజీవ్‌రహదారికి సమీపంలో ఉన్న ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు మొత్తం 405 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల జనావాసాలకు దూరంగా రాజీవ్ రహదారికి సమీపంలో ఉండటంతో రాత్రి వేళల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది అందరూ మహిళలే కాబట్టి భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో పాఠశాల ఆవరణలోకి పాములు, ఇతర జంతువులు వచ్చే అవకాశం ఉంది.

మొక్కలు పెంచాలన్నా...

పాఠశాల ఆవరణలో విశాలమైన మైదానం ఉన్నప్పటికీ ప్రహరీ లేకపోవడంతో మొక్కలు పెంచే అవకాశం లేకుండా పోయింది. విద్యార్థులు మైదానంలో ఆడుకునేందుకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో తమ పిల్లల రక్షణ విషయంలో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీని ఏర్పాటు చేస్తే గేట్ వద్ద తనిఖీల తర్వాతే ఎవరైనా లోపలికి వచ్చే అవకాశముంటుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి

పాఠశాలకు ప్రహరీగోడ లేకపోవడంతో పలు ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవం. ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరోసారి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపి పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరుతున్నాం.

- నీరజ స్పెషల్ ఆఫీసర్ కేజీబీవీ కొమురవెల్లి

రేషన్ డీలర్ల అభ్యున్నతే ధ్యేయం



రేషన్ డీలర్ల జిల్లా కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు

సిద్దిపేట ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రేషన్ డీలర్ల అభ్యున్నతి కోసం అనునిత్యం శ్రమిస్తానని రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో రేషన్ డీలర్ల సిద్దిపేట జిల్లా నూతన కమిటీ అభినందన సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికే ఆదర్శంగా సిద్దిపేట జిల్లా ఎన్నికలు నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో రేషన్ డీలర్ల ఏక నాయకత్వం ఉంటే సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతాయని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 17,200 మంది రేషన్ డీలర్ కుటుంబాలను, ఎదుర్కొంటున్న సమస్యల నుండి కాపాడుకునే బాధ్యత రాష్ట్ర నాయకత్వానికి ఉందని, రాష్ట్ర డీలర్లు సమిష్టిగా కలిసి ఉండి సమస్యల పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కరోనా సమయంలో ప్రజలకు సేవలు అందించిన ఘనత రేషన్ డీలర్లకు దక్కుతుందన్నారు. అనంతరం సిద్దిపేట జిల్లా నూతన అధ్యక్షుడు వంగరి నాగరాజు, ప్రధాన కార్యదర్శి శబనా తాబుసం అజీజ్, కమిటీ సభ్యులను ఆయన శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సంజీవరెడ్డి, కుమార్, మురళి, దొమ్మాటి రవీందర్, పలు జిల్లాల నాయకులు, మండల అధ్యక్ష కార్యదర్శులు రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం

● పలుచోట్ల బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు



రాయపోల్ పోలీస్‌స్టేషన్ వద్ద అరెస్టయిన బీజేపీ నాయకులు

కోహెడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ బాటలోనే పయనిస్తుందని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం, మాజీ ఎంపీటీసీ ఖమ్మం స్వరూప పేర్కొన్నారు. ఆదివారం కోహెడలో వారిని ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రధాని మోదీ మాతృమూర్తిపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మహిళా ప్రజాప్రతినిధుల ఆందోళనను అడ్డుకునేందుకే ముందస్తు అరెస్టులు చేశారన్నారు. రాహుల్ గాంధీ మహిళలకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

బీజేపీ శక్తి కేంద్రాల సమావేశం

కోహెడ-ధర్మసాగర్‌పల్లి, సీసీపల్లి, కాచాపూర్, వెంకటేశ్వరపల్లి శక్తి కేంద్రాల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి శక్తి కేంద్రాల ప్రభారీలు గుగ్గిళ్ల శ్రీనివాస్, కంది సత్యనారాయణ రెడ్డి హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేలా పనిచేసేందుకు పార్టీ బలోపేతంపై వారు దిశ నిర్దేశం చేశారు.

● **రాయపోల్:** ప్రధాని మోదీ తల్లిపై అనుచితవ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు ఆదివారం మండలకేంద్రంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసే యత్నాన్ని స్థానిక పోలీసులు అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ మండల అధ్యక్షుడు మంకిడి స్వామి, మాజీ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు పలువురిని ముందస్తుగా అరెస్టు చేసి రాయపోల్, బేగంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి

● తొగుట: మోదీ తల్లిని దూషించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీజేవైఎం జిల్లా మాజీ అధ్యక్షుడు విభీషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తొగుటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిహార్ ఎన్నికల్లో గెలిచే సత్తాలేక దేశ ప్రధాని కుటుంబంపై తీవ్రమైన ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. వెంటనే రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రాహుల్‌గాంధీ యూరియా అడిగితే కేసులు పెడతారా?



రాజీవ్ రహదారిపై కాంగ్రెస్ నాయకులు ధర్నా

ములుగు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన యూరియాను ఇవ్వకుండా తమ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఆదివారం రాజీవ్ రహదారిపై ములుగులో కాంగ్రెస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రధాని మోదీ ఉద్దేశపూర్వకంగా రాష్ట్రానికి అవసరమైన యూరియాను ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. యూరియాను వెంటనే ఇవ్వాలని అడిగితే రాహుల్‌గాంధీపై తమ కార్యకర్తలతో దాడులకు దిగడం సరైన చర్య కాదని నిరసన వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా ముగ్గు పోయడంలేదు



ఇందిరమ్మ ఇంటి పనులను ముగ్గు పోయాలని కోరుతున్న గజం లక్ష్మి దంపతులు

జగదేవ్‌పూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు ముగ్గు పోసుకొని ఇల్లు నిర్మించుకుంటామంటే ఎంపీడీవో, కార్యదర్శి ముగ్గు పోయవద్దని చెబుతున్నట్టు లబ్ధిదారులు వాపోతున్నారు. మండలంలోని ధర్మారం గ్రామానికి మొదటి విడతలో 14 ఇందిరమ్మ ఇళ్ల మంజూరయ్యాయి. గ్రామానికి చెందిన గజం లక్ష్మి, బత్తుల పరమేశ్‌లకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేసి ప్రొసీడింగ్ పత్రాలను సైతం అధికారులు అందజేశారు. ఇరువురు లబ్ధిదారులు గ్రామంలో ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకుంటామని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లి ముగ్గు పోయాలని కోరారు. మీ ఇద్దరు లబ్ధిదారులు ఎంపీడీవో రామ్‌రెడ్డిని వెళ్లి కలవాలని కార్యదర్శి ప్రవీణ్ వారికి సూచించారు. దీంతో వారు ఎంపీడీవో వద్దకు వెళ్లి తాము ఇంటిని నిర్మించుకుంటామంటే సెక్రటరీ ముగ్గు పోయకుండా మీ వద్దకు పంపించారని ఎంపీడీవోతో తమ బాధను చెప్పుకున్నా పట్టించుకోవడంలేదని బాధితులు వాపోయారు. ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శిపై ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంపీడీవో రాంరెడ్డి, కార్యదర్శిపై చర్య తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

అసత్య ఆరోపణలను ఖండిస్తున్నాం

గజ్వేల్ రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డిపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర మాజీ వైస్ ఎంపీపీల వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గజ్వేల్‌లో అధిక వర్షాలు పడటం కారణంగా ప్రజ్ఞాపూర్ ఊర చెరువు నుంచి నీరు రోడ్డుపైకి వచ్చాయని, ప్రజ్ఞాపూర్ చెరువు మత్తడి నీళ్లకు ప్రతాప్‌రెడ్డికి ఏం సంబంధమని ప్రశ్నించారు.

ప్రక్షాళన షురూ

(5వ పేజీ తరువాయి)

ఈ బదిలీలు జరిగాయి. మరికొంతమందిని కూడా గుర్తించి బదిలీ చేయనున్నట్లు సమాచారం. ఈ పరిణామాలతో తాత్కాలిక ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. గతంలో మెప్మా, రెవెన్యూ విభాగాల్లో పని చేసిన ఉద్యోగులు బదిలీ అయిన నేపథ్యంలో, ఇప్పుడు ఏ క్షణంలోనైనా తమ బదిలీ ఉత్తర్వులు వస్తాయేమోనని మిగతా ఉద్యోగులు అయోమయంలో పడిపోయారు. ఈ మార్పుల వల్ల ఉద్యోగులు సమయానికి కార్యాలయానికి రావడం, ఫైళ్లు వేగంగా కదలడం వంటి మార్పులు మొదటిసారిగా చోటుచేసుకుంటున్నాయి. కొందరు ఉద్యోగులు అవినీతి జోలికి పోకుండా, తమ ఉద్యోగాన్ని కాపాడుకునే ప్రయత్నంలో ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకోవాలని చూస్తున్నట్లుగా వినిపిస్తోంది.

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

మున్సిపల్ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు. మున్సిపాలిటీకి వచ్చే ప్రజల దరఖాస్తులను త్వరగా ఆన్‌లైన్ చేసి, పారదర్శకంగా పనులు పూర్తి చేయాలి. ఎవరైనా అవినీతికి పాల్పడినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- ఆశిత్ కుమార్, మున్సిపల్ కమిషనర్, సిద్దిపేట

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

సిద్దిపేట రూరల్,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో చోటు చేసుకున్నది. స్థానికులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతమడక గ్రామానికి చెందిన రాందేని శ్రీనివాస్ (54) కూలీ పని చేసుకుంటు జీవిస్తున్నాడు. జీవనోపాధి కోసం ఈఎంఐ(వాయిదా పద్దతి)లో ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. అయితే ట్రాక్టర్ సరిగా నడవకపోవడంతో చుట్టు పక్కల వారి వద్ద అప్పులు తెచ్చి ఈఎంఐ కట్టేవాడు. అంతేకాకుండా ఇంటిపైన కుడా లోన్ తీసుకుని చిన్న హోటల్ నడిపించుకుంటున్నాడు. అది కూడా సరిగా నడవకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలని బాధపడుతుండేవాడు. కుటుంసభ్యులు ధైర్యం చెప్పినప్పటికీ శ్రీనివాస్ మానసిక వేదనకు గురయ్యాడు. మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్తున్నట్టు ఇంట్లో చెప్పి సాయంత్రం సమయంలో గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

హామీలను మర్చిన ప్రభుత్వం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తపస్ నాయకులు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నిటిని మరిచి ఉద్యోగులకు మొండి చేయి చూపిందని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీరని అన్యాయం చేస్తుందని తపస్ జిల్లా అధ్యక్షుడు ఊడెం రఘువర్ధన్ రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని శిశుమందిర్‌లో తపస్ జిల్లా అధ్యక్షుడు ఊడెం రఘువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన తపస్ జిల్లా స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు పింగోజు జనార్ధన్, పబ్బతి శ్రీనాకర్ రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి చిలుముల మురళీధర్‌లతో కలిసి సెప్టెంబరు 1న నిర్వహించే 'మన పాఠశాల- మన ఆత్మగౌరవం' సభలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం రఘువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామని మేనిఫెస్టోలో పెట్టినా, నేటికీ దానిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. హామీలను గుర్తు చేయడం కోసం సెప్టెంబర్ 1న విద్రోహదినంగా పాటిస్తామన్నారు. సెప్టెంబర్ 1న తపస్ ఆధ్వర్యంలో రెండు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని మన పాఠశాల- మన ఆత్మగౌరవం, అలాగే ఆత్మగౌరవ సభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు స్వామిగౌడ్, లింగమూర్తి, ప్రవీణ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లేశం వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



పోలీసుల అదుపులో ఆశవర్కర్లు

సిద్దిపేట రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని ఆశ వర్కర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి డిమాండ్ చేశారు. సెప్టంబరు 1న హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా సిద్దిపేట రూరల్ పోలీసులు ముందస్తుగా ఆశ వర్కర్లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బాలమణి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆశవర్కర్లు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. అదేవిధంగా ఆశర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. అరెస్టయినవారిలో సంఘం జిల్లా నాయకురాలు భూ లక్ష్మితో పాటు ఆశ వర్కర్లు ఉన్నారు.

సుప్రీం కోర్టులో పిటిషన్‌పై గిరిజన నాయకుల ఆందోళన



హుస్నాబాద్‌లో ఆందోళన చేస్తున్న గిరిజన నాయకులు

హుస్నాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబితా నుంచి బంజరా, లంబాడీలను తొలగించాలని సోయం బాపురావు, తెల్లం వెంకట్రావులు సుప్రీం కోర్టులో పిటిషన్ వేయడాన్ని నిరసిస్తూ ఆదివారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గిరిజన నాయకులు ఆందోళన నిర్వహించారు. అనంతరం పట్టణంలోని బంజారా భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిపారు. ఈ విషయంపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసేందుకు నిర్ణయించారు. సోయం బాపురావు, తెల్లం వెంకట్రావులపై చర్యలు తీసుకునేలా సీఎం కోరాలని తీర్మానించారు. అలాగే సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావుల మద్దతు కోరాలని, సీనియర్ న్యాయవాదులతో కలసి కౌంటర్ పిటిషన్ దాఖలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే హుస్నాబాద్ నుంచి హైదరాబాద్‌కు పాదయాత్ర చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎం బీలునాయక్, ఎల్ కిషన్‌నాయక్, శారద, బి వీరన్న, రామచంద్రనాయక్, బి శ్రీనివాస్ నాయక్, భిక్షపతి, శంకర్, కాళిదాసు, భాస్కర్, సత్యం, తిరుపతి నాయక్ తదితరులున్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు కొత్తపల్లి మద్దతు



సతీష్‌కుమార్‌కు బీసీ పొలిటికల్ జేఏసీ కండువా కప్పి ఆహ్వానించిన తీన్మార్ మల్లన్న

మద్దూరు, 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జనగామ నియోజకవర్గ నాయకులు, మద్దూరు మండలం సలాఖ్‌పూర్ గ్రామానికి చెందిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తపల్లి సతీష్‌కుమార్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో పాటు తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ సుదగాని హరిశంకర్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్‌కు పొలిటికల్ జేఏసీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. బీసీ రాజ్యస్థాపన కోసం కృషి చేస్తున్న తీన్మార్ మల్లన్నకు మద్దతుగా బీసీలంతా ఏకతాటిపైకి 2028 ఎన్నికల్లో బీసీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులున్నారు.



తొగుట: హనుమాన్‌నగర్‌లో గణేష్ మండపం వద్ద మహిళల కుంకుమార్చన



కొండపాకలో జాగృతి ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని దర్శించుకున్న ఐఏఎస్ అఖిల్‌ను సత్కరిస్తున్న యూత్ సభ్యులు

పూజలు.. నిమజ్జనాల సందడి



మర్కుక్: పాములపర్తిలో పర్యావరణ హిత మట్టి గణపతి మండప నిర్వాహకులకు జ్ఞాపికను అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు దేశబోయిని పర్సింలు

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వివిధ రూపాల్లో వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించిన ఆయా మండపాల నిర్వాహకులు ఆదివారం రాత్రిపూట ప్రత్యేక పూజలు, భజనలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మండపాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించడంతో చూపరులను ఆకర్షిస్తున్నాయి. ప్రజలు చిన్నా, పెద్దా తేడా లేకుండా ఆయా గణేష్ మండపాలను భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. విగ్రహాలను ప్రతిష్ఠించి 5రోజులు పూర్తి కావడంతో పలుచోట్ల నిమజ్జనాలు సైతం ప్రారంభమయ్యాయి. దీంతో ప్రధాన రోడ్లపై సందడి వాతావరణం నెలకొన్నది.



దుబ్బాకలో గణేషుడి ప్రతిమను పెద్దచెరువులో నిమజ్జనం చేసేందుకు వెళ్తున్న చిన్నారులు